క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు, పాస్టర్లు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్, పహాడీషరీఫ్ ఎలక్ట్రిసిటీ సబ్ స్టేషన్ ప్రాంగణాల్లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ బిషప్ వీరాజీ బైబిల్‌లోని సందేశాలను భక్తులకు వినిపించారు. ఏసుక్రీస్తు జనన విశేషాలను తెలియజేశారు. అనంతరం కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు జాన్, మోజేశ్‌నాయక్, అగ్రిప్ప, సత్యనారాయణ, ప్రభుదాస్, రవికుమార్, ధనసింగ్, శేఖర్, యాదగిరి, శ్యామ్‌సుందర్, జాకబ్, రమేశ్, మల్లేశ్, విజయ్, మొయినుద్దీన్,సత్యనారాయణ, రవి, దశరథం, రామనాథం, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అరెస్టయిన నాయకులను వెంటనే విడుదల చేయాలి



బేర బాలకిషన్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

హుడాకాంప్లెక్స్: అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన మాలలను వెంటనే విడుదల చేయాలని మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల ఐక్యవేదిక పిలుపుమేరకు గురువారం అసెంబ్లీ ముట్టడి సందర్భంగా సరూర్‌నగర్ పోలీసులు బాలకిషన్‌ను ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాల, మాదిగలకు పంచాయితీ పెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

వైభవంగా ధనుర్మాస వేడుకలు



భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జెన్నాయిగూడ శ్రీ ఛత్రగిరి లక్ష్మినర్సింహాస్వామి, శ్రీనగర్ ఆదిలక్ష్మి భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ధనుర్మాస వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం నాలుగో రోజు ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేలంకరణ, పూజలు చేశారు. భక్తులు స్వామివారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతోంది. గురువారం నాలుగో రోజు వార్డుల వారీగా కేటాయించిన అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ప్రజా పాలన దరఖాస్తుల ఆధారంగా ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను సేకరించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో నిలిచిపోయిన బాక్స్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. నాగేశ్వర్‌నగర్ కాలనీ, ఎస్ఆర్ఎల్ కాలనీ, తెలంగాణ పార్క్‌లో గురువారం ఆయన పర్యటించారు. గాయత్రిపురం నుంచి నాగేశ్వర్‌నగర్, శ్రీ రామలింగేశ్వర కాలనీ మీదుగా మూసీకి వెళ్లే బాక్స్ డ్రైనేజ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తయిన ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్లే వేసేలా చూడాలని అధికారులకు సూచించారు. పార్క్ అభివృద్ధికి అధికారులతో చర్చిస్తున్నామని పార్కులో ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్పొరేటర్ వెంట అధికారులు బుచ్చయ్య, శానిటైజేషన్ సూపర్‌వైజర్ ప్రేమ్, భరత్, రాజురెడ్డి, కాలనీ వాసులు సుధాకర్, విజయభాస్కర్, జంగయ్య, లక్ష్మీరాజు, రవి, రాకేష్ యాదవ్, నారాయణ ఉన్నారు.

కూరగాయల సాగుతో అధిక దిగుబడి

యాసంగిలో వరికంటే పూలు, పండ్లతోటలు మేలు

- రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడండి
- సౌమ్య ఉద్యానవన శాఖ అధికారిణి



మహేశ్వరం: యాసంగిలో వరికంటే కూరగాయలు, పూలు, పండ్ల సాగు చేసుకుంటే అధిక రాబడి గడించొచ్చని మహేశ్వరం ఉద్యాన శాఖ అధికారిణి సౌమ్య గురువారం పేర్కొన్నారు. మహేశ్వరం, కందుకూరు మండలాల రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఆయిల్ పామ్ సాగు చేపడితే అధిక లాభాలు సాధించొచ్చన్నారు. దీనికి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని, ఆసక్తి కలిగిన వారు మహేశ్వరం ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు. ఆమెతో ముఖాముఖిలో ఈ క్రింది వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం రైతులకు అందిస్తున్న సబ్సిడీ పథకాలు ఎలాంటివి?

జవాబు: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తుంది. ఈ సాగుపై ఎకరానికి 90 శాతం సబ్సిడీతో 57 మొక్కలు అందిస్తుంది. మార్కెట్లో ఒక మొక్క ధర రూ.200 ఉండగా ప్రభుత్వం రైతులకు రూ.20 లకే అందజేస్తుంది.

ప్రశ్న: ఆయిల్ పామ్ సాగుకు డ్రిప్ అందిస్తుందా?

జవాబు: ఆయిల్ పామ్ సాగు చేపట్టే ఎస్సీ, ఎస్టీ రైతులకు ఎకరానికి 100 శాతం సబ్సిడీ, బీసీ, ఓసీ సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 80 శాతం సబ్సిడీ అందిస్తుంది. ఎకరానికి రూ.4,200లను సాగు ఖర్చులకు 4 సంవత్సరాల పాటు ప్రభుత్వం ఇస్తుంది.



సౌమ్య, ఉద్యాన శాఖ అధికారిణి, మహేశ్వరం

ప్రశ్న: దీనిపై అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. మండలంలో ఉన్న రైతు వేదికల ఉద్యానవన కార్యాలయాల్లో రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఆయిల్ పామ్ సాగు చేపడితే అధిక దిగుబడులు వస్తాయని, ప్రభుత్వం అధిక సబ్సిడీ అందిస్తుందని అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఏవిధంగా సహకరిస్తుంది?

జవాబు: ఎస్సీ, ఎస్టీ రైతులకు పండ్ల తోటల పెంపకానికి సాగు ఖర్చులను అందజేస్తుంది.

ప్రశ్న: ఈ సీజన్‌లో రైతులు ఎలాంటి పంటలు సాగు చేసుకోవాలి?

జవాబు: ఉద్యాన రైతులు ఈ సీజన్‌లో టమాటా,బెండ,వంకాయ, దొండకాయ, బీరా, మిర్చి, ఆకుకూరలు కొత్తిమీరా, పాలకూర, తోటకూర, మెంతం, పూదీన ఇతర పంటలను సాగు చేసుకోచ్చు.

ప్రశ్న: రైతులకు సబ్సిడీపైన కూరగాయాల నారు ఎక్కడ ఇస్తారు?

జవాబు: రైతులకు సబ్సిడీపైన నాణ్యతతో కూడిన అధునిక పద్ధతులతో సాగు చేసిన హైబ్రీడ్ టమాటా, వంకాయ, మిర్చి నారును హైదరాబాద్ జీడిమెట్లలో అందిస్తున్నాం. నారు కావాల్సిన వారు మహేశ్వరం మండల కేంద్రంలో ఉద్యాన శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

ప్రశ్న: రైతులు ఉద్యాన పంటలకు ఎలాంటి ఎరువు వాడాలి?

జవాబు: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులను వాడితే అధిక దిగుబడితో పాటు తెగుళ్ల నియంత్రించవచ్చు.

ప్రశ్న: ప్రయివేట్ నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలంటే అనుమతులు తప్పనిసరిగ్గా తీసుకోవాలా?

జవాబు: గ్రామాల్లో కొంత మంది రైతులు ప్రయివేట్‌గా ఏర్పాటు చేసుకున్న నర్సరీలకు ఉద్యాన శాఖ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతి తీసుకోని నర్సరీల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఈ సీజన్‌లో ఆకుకూర, కూరగాయ పంటలకు తెగుళ్ల సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: కూరగాయ పంటల సాగులో రసం పీల్చే పురుగు, కొమ్మ తులుచు పురుగు, ఆకుపచ్చ తెగులు, లద్దే పురుగు, కొమ్మ కుల్లు తెగుళ్ల ఆశించే అవకాశాలు ఉన్నాయి. తెగుళ్ల నివారణ మందులు పిచికారీ చేపట్టి నివారించవచ్చు.



రాచకొండ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మేయర్ పారిజాత

పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

బడంగ్‌పేట్: నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో గురువారం కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్‌బాబును బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతానర్సింహారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్‌లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. మున్సిపల్‌లో రోజురోజుకి జనాభా విపరీతంగా పెరుగుతూ వస్తోందని, ప్రజల అవసరాల దృష్ట్యా పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని మేయర్ వినతిపత్రంలో పేర్కొన్నారు. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వయా ఆదిబట్ల వెళ్లే ప్రధాన రహదారిలో స్టేషన్‌కు సరిపోనూ స్థలాన్ని కూడా కేటాయించామన్నారు. అందుకు ఇటీవల జరిగిన కౌన్సిల్‌లో స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కార్పొరేటర్లు అందరం ఏకగ్రీవ తీర్మానం కూడా చేశామని తెలిపారు. దానికి సంబంధించిన కౌన్సిల్ తీర్మాన ప్రతిని కూడా కమిషనర్ సుధీర్‌బాబుకు అందజేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త జీపీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని 9 కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ఎమ్మెల్యే పి.సబితారెడ్డి కలెక్టర్‌కు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వీటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతిపాదనలు పంపిన గ్రామాలు ఇవే. మహేశ్వరం మండలంలోని పెద్దమ్మతండా పంచాయతీ నుంచి నల్లచెర్వుతండా, నాగుల్‌దోనితండా పంచాయతీలో దయాల్‌గుండుతండా, నాగారం పంచాయతీ నుంచి ఎనుగుచెర్వుతండా, గంగారం పంచాయతీ నుంచి గంగారంతండా, మైలార్‌బాయితండా, కందుకూరు మండలం నుంచి గుమ్మడవెల్లి పంచాయతీ నుంచి గుమ్మడవెల్లితండా, కొత్తురు పంచాయతీ నుంచి గఫూర్‌నగర్, నేదునూరు పంచాయతీ నుంచి మన్నెగూడ, ఆకులమైలారం పంచాయతీ నుంచి మాలగూడ, సార్లపల్లి పంచాయతీ నుంచి పోతుబండతండా, పెద్దమ్మతండా పంచాయతీ నుంచి నల్లచెర్వుతండాలను రెండు మండలాల నుంచి తొమ్మిది కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కలెక్టర్ నారాయణరెడ్డికి ప్రతిపాదనలు పంపారు. జిల్లా కలెక్టర్ మహేశ్వరం, కందుకూరు మండలాల ఎంపీడీఓ, ఎంపీఓలతో పాటు ఇతర అధికారుల నుంచి కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు కావాల్సిన వివరాలను, రెవెన్యూ మ్యాపులను అడిగి తెలుసుకున్నారు. కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేస్తే ఉన్న గ్రామ పంచాయతీల నుంచే అనుబంధ గ్రామాల రెవెన్యూ తగ్గుతుందని, ఉన్న గ్రామ పంచాయతీలు యథావిధిగా ఉంటే చాలని ఆయా గ్రామాల ప్రజలు, నేతలు భావిస్తున్నారు. కొందరైతే కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేస్తే పాలనపరంగా అన్ని విధాలుగా సౌలభ్యంగా ఉంటుందని అంటున్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న శ్రీనివాస్

శంషాబాద్: ప్రస్తుత సమాజంలో ప్రతి రంగంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా మారిందని మోర్ట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో సీఎస్‌సీ అకాడమీ ఆధ్వర్యంలో కంప్యూటర్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు నిర్వాహకులు జాఫర్‌అలీతో కలిసి ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధి అవకాశాలను కల్పించే కంప్యూటర్ పరిజ్ఞానం నేర్పించేందుకు సీఎస్‌సీ అకాడమీ తీసుకుంటున్న చర్యలను అభినందించారు. కార్యక్రమంలో మహ్మద్ అస్లాం, ప్రశాంత్, ప్రియాంక శ్రీవాత్సవ, శ్రీదేవి, శివకుమార్, జుబేర్ పాల్గొన్నారు.

సమాజానికి సమైక్యతా స్ఫూర్తి అవసరం

మన్సూరాబాద్: అష్ఫాఖ్-బిస్మిల్, ఉద్ధమ్‌సింగ్, స్వామి వివేకానంద, నేతాజీ, గాంధీ-గఫార్‌ఖాన్ సమైఖ్యతా స్ఫూర్తి నేటి సమాజానికి అవసరమని ఖదిజ్ఞాసీ రమణమూర్తి, జయహో జాతీయ అధ్యక్షుడు విజయశంకర్ స్వామి అన్నారు.
అష్ఫాఖ్-బిస్మిల్ వర్ధంతి పురస్కరించుకుని జైభారత్ ఉద్యమం, జయహో సంయుక్త ఆధ్వర్యంలో ఎల్బీనగర్ సూర్యోదయకాలనీలోని జైభారత్ కేంద్ర కార్యాలయం నుంచి సమైఖ్యత ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విజయశంకర్ స్వామి, రమణమూర్తి మాట్లాడుతూ.. హిందూ ముస్లింల ఐక్యత దేశానికి అవసరమన్నారు. డిసెంబర్26న ఉద్ధమ్‌సింగ్ జయంతి, జనవరి 12న స్వామి వివేకానంద జయంతి, జనవరి 20న అబ్దుల్ గఫార్‌ఖాన్ వర్ధంతి, జనవరి 23న నేతాజీ జయంతి, జనవరి 30న గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని డిసెంబర్ 19 నుంచి జనవరి 30 వరకు హిందూ ముస్లిం సమైఖ్యతా దినాలుగా పాటిస్తున్నామన్నారు. మతోన్మాదం దేశానికి తీవ్రమైన సమస్య అని దేశం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన హిందూ, ముస్లిం వీరుల త్యాగాలు నేటి తరానికి తెలపడమే ప్రధాన లక్ష్యంగా సభలు, సమైఖ్యతా ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలో ఖదిజ్ఞాసీ లోక్‌నాథ్, రజనీ, వంశీ, వెంకన్న, సలీం, మల్లీకా వల్లభ, లక్ష్మీశ్వర్, రాజు, లావణ్య, ఉమ, లక్ష్మి పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్‌లో సమైఖ్యతా ర్యాలీ

మరమ్మతులు చేపట్టండి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ రాజ్‌కుమార్‌తో కలిసి గురువారం ఆయన ఎస్కేడీ నగర్, వైదేహినగర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గుంతలమయంగా ఉన్న రోడ్లతో కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దామోదర్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

న్యాయసలహా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

హస్తినాపురం: పేద ప్రజలకు కావాల్సిన న్యాయ సహాయాన్ని అందించేందుకు ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు. హస్తినాపురం సెంట్రల్‌కాలనీ లోని నివాసితుల సంక్షేమ సంఘం భవనంలో ఉచిత న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం జరిగేలా తాము సలహాలు ఇస్తున్నామన్నారు. ప్రతి గురువారం నిర్వహించే కార్యక్రమాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, కొండారెడ్డి, కె.ఆనంద్‌రావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ శిక్షణ

మన్సూరాబాద్: అభివృద్ధి చెందుతున్న దేశాల భూవిజ్ఞాన శాస్త్రజ్ఞుల రిమోట్ సెన్సింగ్, డిజిటల్ ఇమేజ్ ప్రాసింగ్‌పై 14వ అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం గురువారం భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణా సంస్థ (జీఎస్ఐటీఐ)లో ముగిసింది. ఈ కార్యక్రమానికి జీఎస్ఐటీఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్. రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధి, వృత్తిపరమైన నైపుణ్యం, సాంకేతికతను పంచుకోవడం కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. నూతనంగా నేర్చుకున్న సాంకేతికతలను వారి వృత్తిలో ఉపయోగించి నైపుణ్యాలను పెంచుకోవాలని ఆకాంక్షించారు. 14 దేశాల నుంచి 22 మంది శాస్త్రవేత్తలు మూడు వారాల పాటు శిక్షణలో పాల్గొన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎబీ ఎక్కా, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 15, వంకాయ రూ. 28, బెండ రూ. 50, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 38, బీర రూ. 55, క్యాబేజీ రూ. 18, ఫ్రెంచిబీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 25, దొండ రూ. 45–50, చిక్కుడు రూ. 50, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 45, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 27, దోస రూ. 23, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 40, చామగడ్డ రూ. 35. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



సరిత



అనన్య, ఆద్య

హయత్‌నగర్: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భర్తకు దూరమైన మందుల సరిత తన ఇద్దరు కుమార్తెలు అనన్య(5), ఆద్య(4)తో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్టు లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివసించే తన అక్క వద్ద ఉంటుంది. రెండు నెలల క్రితం ఆమె హయత్‌నగర్‌లోని వీరభద్ర కాలనీలోకి అద్దెకు తీసుకుని రామోజీ ఫిలింసిటీలో షూటింగ్‌లో పని చేస్తుంది. మూడ్రోజుల నుంచి సరిత ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో బంధువులు ఇంటికి వచ్చి చూడగా అక్కడి నుంచి ఇల్లు ఖాళీ చేసినట్లు యజమాని తెలిపాడు. సరిత అక్క కొడుకు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మరో ఘటనలో మైనర్..

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ శాంతినగర్‌లో నివసించే ఓ మైనర్(15) అదృశ్యమైంది. బుధవారం కుటుంబ సభ్యులు వారివారి పనులపై బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి రాగా మైనర్ బా లికి కనిపించలేదు. ఆందోళనకు గురై, స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బకాయిలు విడుదల చేయాలని వినతి



ఆకునూరి మురళీకి వినతి పత్రం అందజేస్తున్న గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ నాయకులు

మంచాల: మధ్యాహ్న భోజన పథకం బకాయిలు విడుదల చేయాలని విద్య శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీకి వినతి పత్రం అందజేశారు. గురువారం మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల సందర్శనకు వచ్చిన రాష్ట్ర విద్య శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడే ఉన్న మధ్యాహ్న భోజన కార్మికురాలు స్వాతి చైర్మన్‌తో తన గోడు వెల్లబోసుకుంది. గత 10నెలలుగా బిల్లులు, ఐదునెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మార్కెట్‌లో గుడ్డు ధర చెల్లించక పోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నామని వాపోయారు. మార్కెట్‌లో పెరిగిన నిత్య అవసర సరుకుల ధరలకు అనుగుణంగా మెనూ రేట్లు ఇవ్వక పోవడంతో తాము అప్పులు చేసి వడ్డిస్తున్నామన్నారు. సకాలంలో బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన చైర్మన్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

గెజిటెడ్ హెచ్ఎంల సంఘం వినతి

రాష్ట్రంలో విద్య వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మంచాల మండలంలోని ఆరుట్లలో ఆకునూరి మురళీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, కోశాధికారి తుకారాం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో కక్ష సాధింపు

ఇబ్రహీంపట్నం: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుదని బీఆర్ఎస్ నాయకుడు, స్థానిక మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఈ-కార్ రేసింగ్‌తో ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఇమేజ్ పెంచిన మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టాడాన్ని తీవ్రంగా ఆయన ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, అక్రమాలను బట్టబయలు చేస్తూ పోరాటం చేస్తున్నందుకే కేటీఆర్‌పై రేవంత్ సర్కార్ కక్ష కట్టిందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, అబద్ధపు ప్రచారాలు చేసినా ప్రజా కోర్టులో రేవంత్ సర్కార్‌కు ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

పోరాటాలు ఉధృతం చేస్తాం

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదయ్య
- మున్సిపల్ కార్యదర్శిగా కిషన్



మాట్లాడుతున్న పగడాల యాదయ్య

తుర్కయంజాల్: రానున్న రోజుల్లో సీపీఎం మరిన్ని ప్రజా పోరాటాలు, ఉద్యమాలు ఉధృతంగా చేపట్టనుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల యాదయ్య తెలిపారు. గురువారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని అరుణ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ప్రథమ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాసభలకు కె అరుణ్ కుమార్, కె. శారద అధ్యక్షులుగా వ్యవహరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, కార్యదర్శి వర్గ సభ్యుడు బి. సామేల్, డి. జగదీశ్‌లు అబ్జర్వర్లుగా వ్యవహరించారు. అనంతరం మున్సిపల్ కన్వీనర్ డి. కిషన్ గడిచిన మూడేళ్లలో ఉద్యమ నిర్మాణ కర్తవ్యాలను, కార్యక్రమాలను మహాసభ ఎదుట ఉంచారు. శాఖల వారీగా చర్చించిన సభ్యులు కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు.

కార్యదర్శిగా డి కిషన్ నియామకం

మహాసభ 9 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకుంది. మున్సిపల్ కార్యదర్శిగా డి. కిషన్, సభ్యులుగా ఎం. సత్యనారాయణ, కె. అరుణ్ కుమార్, జె. ఆశీర్వాదం, కె. వెంకట కృష్ణ, శ్రీరామమూర్తి, ఐ. భాస్కర్, కె. శారద, డి. శ్రీధర్‌లను మహాసభ ఎన్నుకుంది.

అవార్డు అందుకోవడం సంతోషకరం

కమిషనర్ అమరేందర్ రెడ్డి

తుర్కయంజాల్: చేంజ్ మేకర్స్ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని కమిషనర్ కే. అమరేందర్ రెడ్డి తెలిపారు. న్యూ ఢిల్లీలోని హాబిటాట్ సెంటర్, ఓక్ హాల్, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో గురువారం అవార్డు ప్రదానం చేశారు. సీఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ సునీత నరైన్ అవార్డు అందజేశారు. 2021 నుంచి 2024 వరకు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ప్రదర్శన, చెత్తతో నూతన వస్తువులను తయారు చేయడం, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా స్వచ్ఛ కార్యక్రమాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మున్సిపాలిటీగా అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.